
ఈనాడు
సూర్యాపేట
శనివారం అక్టోబరు 5, 2024



ఘనంగా కుంకుమ పూజలు

కోదాడ పట్టణంలోని నయానగర్‌లో దేవీ నవరాత్రుల సందర్భంగా శుక్రవారం అమ్మవారిని గాయత్రీ దేవి రూపంలో అలంకరించారు. అనంతరం ముందు భక్తులు కుంకుమ పూజలు నిర్వహించి అన్న దానం చేశారు. - కోదాడ పట్టణం, న్యూస్‌టుడే

వైభవంగా పుష్పయాగం



పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు రెండో రోజు శుక్ర వారం గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెండ్యాల శివన్నారాయణ, మంజుల దంపతులు సమర్పించిన పలు రకాల పూలతో పుష్పయాగాన్ని అర్చకుడు నరగిరినాథుని రంగభట్టాచార్యులు వైభవంగా నిర్వహించారు.
- హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

నేడు ఉద్యోగ మేళా

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈవో భాను నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్ బీ ప్రోగ్రాం కోసం సీఈసీ, బైపీసీ, ఒకేషనల్, హెచ్‌ఈసీ గ్రూపులలో 75 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. హాజరయ్యే విద్యార్థులు పది, ఇంటర్ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు నకలు, పాస్‌ఫొటో, చరవాణిలతో మేళాకు హాజరు కావాలని సూచించారు.

ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించుకోండి

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలో 2020లో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు రూ. వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే పుర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సంప్రదించి క్రమబద్ధీకరించుకోవాలని పుర కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని 773, 774, 759, 760 సర్వే నెంబర్లలో ప్లాట్లను పుర, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో పరిశీలన జరిపించుకోవాలని సూచించారు. అనంతరం ఎల్‌ఆర్‌ఎస్ లాగిన్‌లో జియో ట్యాగింగ్ చేయించి మీ చరవాణికి వచ్చే సమాచారంతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసిడింగ్ పొందాలని పేర్కొన్నారు. అవకాశాన్ని సంబంధిత సర్వే నెంబర్లలో ఉన్న ప్లాట్లు ఉన్న యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖాకీల్లో.. కలకలం

ఉమ్మడి జిల్లాలో త్వరలోనే మరికొందరు అధికారులపై చర్యలు!

ఈనాడు, నల్గొండ : **ఇసుక అక్రమ రవాణా నియంత్రణలో వైఫల్యం చెందడంతో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పనిచేస్తున్న 15 మంది ఎస్సైలపై ఉన్నతాధికారులు వేటు వేయడం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. మల్టీజోన్-2లో వేటు పడ్డ వారిలో ఉమ్మడి జిల్లా ఎస్సైలే అత్యధికంగా ఉండటం గమనార్హం. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక పాలసీపై విధాన నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రభుత్వ రీచుల నుంచి గత కొంత కాలంగా ఇసుక రవాణా నిలిచిపోయింది. దీంతో ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల ద్వారా కొంత మంది అక్రమార్కులు ఉమ్మడి జిల్లాలోని మూసి, కృష్ణా నది పరివాహక ప్రాంతాల వాగులు, వంకల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ల అండతో యథేచ్ఛగా ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు.**

■ గతంలో తుంగతుర్తి నియోజకవర్గంలోని అడ్డగూడూరు, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మోత్కూరు, మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి, అడవిదేవులపల్లి, వాడపల్లి, నల్గొండ నియోజకవర్గంలోని కనగల్, తిప్పర్తి, నాగార్జునసాగర్‌లో హాలియా, సూర్యాపేటలో ఆత్మకూరు(ఎస్), పెన్‌పహాడ్, మునుగోడులో చండూరు, ఆలేరులో గుండాల మండలాల్లోని వాగులు, రీచుల నుంచి ఇసుక సరఫరాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా.. కొంత మంది అక్రమార్కులు దానిని హైదరాబాద్‌కు తరలించేవారు. తుంగతుర్తిలోని వంగమర్తి రీచుతో పాటూ జాజిరెడ్డిగూడెం నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్‌కేంద్రానికి ఇసుక సరఫరా పేరుతో వేల లారీలను హైదరాబాద్‌కు తరలించారు. ప్రాజెక్టుల పేరుతోనూ అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగింది. కొత్త ప్రభుత్వంలోనూ ఇదే విధమైన ఎత్తుగడలు వేద్దామని ప్రణాళికలు రూపొందించినా ప్రభుత్వ విధానం, మూసీలో ఉద్ధృత ప్రవాహం ఉండటంతో అక్రమార్కుల ఎత్తుగడలు సాగడం లేదు. దీంతో కొన్ని రీచుల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గట్టుపైకి తీసుకొచ్చి వాటిని లారీల్లో డంపు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.


ఎప్పటికప్పుడు నిఘా వర్గాల ఆరా..

■ ఇసుక ఆదాయం ఉన్న పోలీసు స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం బాగా డిమాండ్ ఉంది. కొంత మంది రాజకీయ నాయకులు జిల్లా పోలీసు అధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చి ఫలానా పోస్టింగ్‌లు ఇవ్వాలని సూచిస్తున్నారు.

■ ఇటీవల నల్గొండ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఇసుక ఆదాయం ఉన్న మూడు పోలీసు స్టేషన్లకు పోస్టింగ్‌ల కోసం సదరు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ఆశ్రయించగా ఏకంగా ఒక్కో పోలీసు స్టేషన్‌కు నాలుగు నుంచి ఐదుగురికి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారి ఏదో ఒక పేరుతో మాత్రమే సిఫార్సు లేఖ ఇస్తేనే పోస్టింగ్ ఇస్తామని స్పష్టం చేసినట్లు సమాచారం. మరికొంత మంది ప్రజాప్రతినిధులు పోస్టింగ్‌ల కోసం వచ్చే అధికారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు గతంలో లాగా కాకుండా జిల్లా ఎస్‌బీ విభాగంతో పాటూ రాష్ట్ర నిఘా విభాగం ఆదాయం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులపై ఎప్పటికప్పుడు నిఘా వేసి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఇటీవల వేటు పడ్డ అధికారులపై గత ఆరు నెలల నుంచి పక్కాగా సమాచారం సేకరించి జిల్లా ఉన్నతాధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపడంతో ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

అక్రమ రవాణా అరికట్టనందుకే...

■ ఇసుక అక్రమ రవాణా కట్టడిలో అక్రమార్కులకు అండగా ఉంటున్నారనే నివేదికల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి డివిజన్‌లో పనిచేస్తున్న మరికొంత మంది పోలీసు అధికారులపై త్వరలోనే చర్యలు ఉండనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా రాచకొండ పరిధిలోనే ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు ఇప్పటికే నిఘా వర్గాలు గుర్తించాయి. ఇప్పటికే నివేదికలు ప్రభుత్వానికి చేరాయని.. ఒకట్రెండు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశం ఉన్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి 'ఈనాడు'కు వెల్లడించారు.



48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమ: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. వానాకాలం 2024-25 ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ అధికారులు, ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్, డాటా ఎంట్రి ఆపరేటర్లతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరపై రూ.500 బోనస్ చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వడ్ల రకంపై సందేహాలు వస్తే ధాన్యం పొట్టు తీసి మైక్రోమీటర్ ద్వారా చూడాలన్నారు. తేమ కొలిచే, ధాన్యం శుద్ధి చేసే యంత్రాలు, మైక్రోమీటర్, ట్యాబ్, గన్నీ సంచులు, తాగునీరు, హమాలీలు, టార్పాలిన్లను సమకూర్చుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ బీఎస్. లత, డీఆర్డీవో అప్పారావు, జిల్లా సివిల్ సప్లై డీఎంటీఎస్ ప్రసాద్, డీఏవో శ్రీధర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి...

తుంగతుర్తి గ్రామీణం: తుంగతుర్తి మండలంలోని గ్రామీణ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తుంగతుర్తి నియోజవర్గంలోని వేలాది మంది ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండలం వెలుగుపల్లి ఆవాసం మల్లన్నగుట్ట వద్ద ఉన్న ప్రభుత్వ స్థలం, సమీపంలోని రుద్రమ్మ చెరువును రిజర్వాయర్ ఏర్పాటుకు అక్కడి పరిసరాలను వారు పరిశీలించారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ చరవాణిలో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కావల్సినంత స్థలం అందుబాటులో ఉందని, త్వరలో నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ఉపయోగకరంగా ఉండే భూమిని నిర్ధారిస్తామని పేర్కొన్నారు. ఇక్కడి వారు అమెరికాకు ఉద్యోగాల కోసం వలస పోతుంటే అక్కడి వారు ఇక్కడికి వచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఎమ్మెల్యే సామేల్ తెలిపారు. ఏడాది కాలంలో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయించడమే తన లక్ష్యమని చెప్పారు. వారి వెంట జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ నాగరాజు, తహసీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషుకుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్దన్, గోవర్ధన్ ఉన్నారు.



పరిశ్రమల ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎమ్మెల్యే సామేల్

ఉపాధ్యాయ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయండి

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు కందుకూరి సోమన్న, జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో శుక్రవారం జరిగిన ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయమై న్యాయస్థానం ద్వారా తీర్పు వచ్చిందని, ముందుగా తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఉపాధ్యాయ నియామకాల్లో ఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని, వెంటనే వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఈ నెల 9 నుంచి నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ మాదిగ, ఏపూరి రాజు, పాల్వాయి బాలయ్య, బొజ్జ సైదులు, చింత జాన్ విల్సన్, వెంకన్న, నవీన్, మేడి కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ

మంత్రుల మానసిక స్థితిపై అనుమానాలు: జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒక మహిళా మంత్రిగా ఇతర మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కొండా సురేఖ మానసిక స్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ఆమె మాట్లాడిన పదజాలం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో ఇలా మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. మూసీ నది ప్రక్షాళనకు ముందు ముఖ్యమంత్రి, మంత్రుల తమ ఆలోచనలను ప్రక్షాళన చేసుకోవాలని హితవు పలికారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే ఉద్యమం చేస్తామని కోమటిరెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. నేటి మూసీ దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని విమర్శించారు.

దసరా తర్వాత ప్రారంభం
ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 వానాకాలానికి సంబంధించి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. మరో కొద్దిరోజుల్లో వరి కోతలు మొదలుకానున్న నేపథ్యంలో దసరా పండగ తర్వాత కొనుగోలు కేంద్రాలను తెరిచేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే తూకం, తేమ యంత్రాలు, ఇతర సామగ్రిని సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.



ఆత్మకూర్(ఎస్)లో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం (పాతచిత్రం)

జిల్లా గణాంకాలు

సాగైన వరి (ఎకరాల్లో): **4,72,934**

దిగుబడి అంచనా: **10,23,015 ఎంటీలు**

అందులో కొనే ధాన్యం: **3,70,224 ఎంటీలు**

ముమ్మర ఏర్పాట్లు

ఈసారి వర్షాలు ఆలస్యంగా కురవడంతో విడతల వారీగా వరినాట్లు వేశారు. సూర్యాపేట జిల్లాలోని 23 మండలాల్లో 4,72,934 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా 10,23,015 మెట్రిక్ టన్నుల్లో ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. సుమారు 3,70,224 మెట్రిక్ టన్నుల వడ్లు కొనేందుకు నెలల వారీగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కొనుగోళ్లకు ఆటంకాలు ఎదురుకాకుండా రెవెన్యూ, డీఆర్డీవో, మార్కెటింగ్, డీసీవో, సివిల్ సప్లై, వ్యవసాయ అధికారులు సమన్వయంతో ముందుకు సాగనున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించి సమావేశాలు సైతం ఏర్పాటు చేశారు. సాగర్ ఆయకట్టు ప్రాంతాలైన హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఎక్కువ శాతం మిల్లులకే తరలించే అవకాశం ఉంది.

దిగుబడి ప్రకారం కొనుగోలు చేసే ధాన్యం (ఎంటీలలో..)

నెల	కొనే ధాన్యం
అక్టోబరు	74,050
నవంబరు	1,11,070
డిసెంబరు	1,29,580
జనవరి	55,524

206 కేంద్రాలు

జిల్లాలో మొత్తం 206 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. గతంలో జరిగిన పొరపాట్లను సవరించుకుని రవాణాకు లారీలు, హమాలీల కొరత లేకుండా చూసుకోనున్నారు. తరుగు పేరిట దోపిడీ, ధాన్యం డబ్బులు వెంటనే జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లకు ప్రతిపాదనలు

పరికరం	అందుబాటులో ఉన్నవి	కావాల్సినవి
గన్నీ సంచులు	21,72,766	70,82,834
ప్యాడీక్లీనర్లు	309	552
కాంటాలు	309	552
తేమ చూసే యంత్రాలు	374	552

ఉపాధి ప్రణాళికలు షురూ..!

నెలాఖరు వరకు గ్రామసభల నిర్వహణ ప్రక్రియ



జాల గ్రామంలో ఉపాధిహామీ పనుల గుర్తింపు గ్రామసభకు హాజరైన అధికారులు, స్థానికులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే :

ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కల్పిస్తుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు ఉన్న గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిరుపేదలకు బాసటగా నిలుస్తుంది.

ఉమ్మడి జిల్లా సమాచారం..

జాబ్ కార్డులు	జిల్లా	ఉపాధి కూలీలు
3,53,029	నల్గొండ	7,60,181
2,61,126	సూర్యాపేట	5,77,294
1,38,806	యాదాద్రి	2,57,919

★ 2025-26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల తీరుపై ప్రణాళికల రూపకల్పనకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతితో పనులు గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై గాంధీ జయంతి రోజు నుంచి ఈ గ్రామసభల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు వరకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

భూగర్భ జలాల పెంపు పనులకు ప్రాధాన్యం..

పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్టుకాల్వల పనులను చేపట్టారు.

★ ఈ సారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

ఆమోదం రాగానే...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 1740 గ్రామ పంచాయతీలలో ఈ నెలాఖరులోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం వెంటనే గ్రామాల్లో సదరు పనులను ఉపాధికూలీల ద్వారా చేపట్టనున్నారు.

నిత్యావసరాల ధరల నియంత్రణలో విఫలం: సీపీఐ

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులను అదనుగా చేసుకొని దళారులు, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి సరకుల ధరలు పెంచడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అనంతుల మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, నంద్యాల రాంరెడ్డి, నిమ్మల ప్రభాకర్, గోపగాని రవి, పెండ్రా కృష్ణ పాల్గొన్నారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

బతుకమ్మ వచ్చినా.. మూటల్లోనే



నకిరేకల్ పుర కార్యాలయంలో ఏడాది నుంచి మూటల్లో మూలుగుతున్న బతుకమ్మ చీరలు

నకిరేకల్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ మళ్లీ వచ్చింది.. గతేడాది పండగ కోసం తెచ్చిన బతుకమ్మ చీరల్లో మిగిలినవి పంపిణీ నోచుకోవడం లేదు. ఏడాది నుంచి కార్యాలయాల్లో మూటల్లోనే మూలుగుతున్నాయి. చీరలు దుమ్ము పట్టి పోతున్నా.. వాటిపై ముసుగులు కప్పేస్తున్నారు. గత ఏడాది అక్టోబరులో అప్పటి ప్రభుత్వం మహిళలకు పండగ కానుకగా బతుకమ్మ చీరలు పంపిణీ చేసింది. పంపిణీ మొదలు పెట్టిన ఆరు రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చీరల పంపకాన్ని నిలిపివేశారు. ఆ తర్వాత కొలువు దీరిన కొత్త ప్రభుత్వం చీరల పంపిణీపై నిర్ణయం తీసుకోలేదు. అధికారులు చెబుతున్నారు. అప్పుడు పంపిణీ చేయకుండా మిగిలిన చీరలను పంచాయతీ, పుర కార్యాలయాలు, రేషన్ దుకాణాల్లో ఉన్నాయి. ఇలా మిగిలిన చీరల వివరాలను తొమ్మిది నెలల క్రితం అధికారులు సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. పేదింటి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు చీరల కానుకలను పంపిణీ చేయాలన్న యోచనలో ఈ ప్రభుత్వం ఉంది. బతుకమ్మ పండుగకు మహిళలకు ఏం ఇవ్వాలనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బుధవారం ప్రకటించడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా పంచకుండా మిగిలిన చీరలు లక్షల సంఖ్యలో ఉన్నాయి. 2023 అక్టోబరులో నకిరేకల్ మండలం, పురపాలికకు 21,250 బతుకమ్మ చీరలు రాగా కోడ్ అమల్లోకి వచ్చేనాటికి 6,657 చీరలను మాత్రమే పంపిణీ చేశారు. 14,593 చీరలు కార్యాలయాల్లోని మూటల్లో నేటికి మూలుగుతున్నాయి.

★ నిల్వ ఉన్న చీరలపై తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి మార్గదర్శకాలు అందలేదని నకిరేకల్ పుర కమిషనర్ డి.బాలయ్య చెప్పారు.



గతేడాది జిల్లాల వారీగా లబ్ధిదారులు, చీరల వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	వచ్చిన చీరలు (లక్షల్లో)
నల్గొండ	5.61	4.00
సూర్యాపేట	3.27	2.96
యాదాద్రి	2.98	2.26

చికెన్ ధరలు


ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

యాదాద్రి శిల్పాలపై అవతారమూర్తులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: హైందవ సంస్కృతికి దర్పణం పట్టే దేవతామూర్తులతో యాదాద్రి క్షేత్రంలో శిల్పసంపద భక్తజనులకు ఆధ్యాత్మిక ఆహ్లాదం కలిగిస్తున్నాయి. క్షేత్రావిష్కృతిలో భాగంగా ఏకశిలతో చెందిన కృష్ణశిలతో రూపొందించిన అష్టభుజి మండప ప్రాకారాలలోని స్తూపాలపై దశావతారాలను ఆవిష్కృతం చేశారు. స్తూపాలపై ఉన్న ఈ రూపాలు కనువిందుగొలుపుతున్నాయి. శ్రీలక్ష్మీనారాయణ స్వామి, కూర్మావతారం, రామావతారం, వరహావతారం రూపాలే కాకుండా ఇతర దేవుళ్ల రూపాలను పొందుపరిచారు.



కూర్మావతారం



రామావతారం



వరహావతారం



శ్రీలక్ష్మీనారాయణులు

దసరా సెలవులు.. విజ్ఞాన నెలవులు



చరవాణికి దూరం..

విద్యా సంస్థలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, హోం వర్క్ సన్నద్ధతతో హడావుడిగా గడిపారు. కాస్త సమయం దొరికినా స్మార్ట్ చరవాణి చూసేవారు. ప్రస్తుత సెలవుల్లో చరవాణికి అపరిమితంగా అవకాశం ఇవ్వొద్దు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. గంటలకొద్దీ ఫోన్‌లో గడిపే పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి. చరవాణికి అలవాటు పడితే సెలవుల అనంతరం పాఠశాలల సమయాల్లోనూ మనసు చదువుపై నిమగ్నం చేయలేరు.

పెద్దలను గౌరవించడం నేర్పుదాం..



సెలవుల్లో కుటుంబ సభ్యులు తమ నేపథ్యాన్ని చెప్పాలి. ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరామనే విషయాన్ని వివరించాలి. పరస్పరం గౌరవించే విధానాన్ని అలవర్చాలి. సెలవుల్లో పిల్లలను బంధువుల ఇళ్లకు పంపిస్తుంటారు. పెద్దలను గౌరవించడం నేర్పించాలి. ఇందుకోసం రోజులో కొంత సమయాన్ని కేటాయించాలి. వారితో కలిసి భోజనం చేయడం, సరదాగా.. స్నేహపూర్వక వాతావరణంలో మెలుగుతూ ఉండాలి.

సమయం వెలకట్టలేనిది.. ప్రణాళికతో ముందుకెళ్తే ప్రతి క్షణం ఉన్నతులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుంది. ప్రభుత్వం విద్యార్థులకు ఈ నెల 14 వరకు దసరా సెలవులు ప్రకటించింది. వీటిని విద్యార్థులు వినోదంతో పాటు విజ్ఞానమయంగా మార్చుకోవచ్చు.

నాంపల్లి, న్యూస్‌టుడే:

ప్రోత్సాహంతో.. ఉత్సాహం..




పిల్లలకు ఆసక్తి ఉన్న ఆట పాటలతో పాటు నచ్చిన కళవైపు ప్రేరేపించేందుకు సెలవులు మంచి సమయంగా భావించాలి. చిత్రలేఖనం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం, వాద్యం ఇతర అంశాలనే నేర్చుకునే దిశగా ప్రేరేపించి, ఫలితంగా వాటిపై పట్టు సాధించవచ్చు.

సంస్కృతి నేర్పిస్తే..



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల ప్రభావం ఎంతో ఉండేది. చిన్నా.. పెద్ద అంతా కలిసి ఉండేవారు. సెలవుల్లో అమ్మమ, నాయనమ్మ, బంధువుల ఇళ్లకు వెళ్లడం పరిపాటి. ఇదే అదనుగా సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వేదికగా మార్చుకోవాలి. పండుగల విశిష్టతను తెలియజేయాలి.

పుస్తకం వైపు మరలేలా..



మారుతున్న పరిస్థితుల్లో పిల్లలు పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. అత్యధికులు ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ఎనలేని విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఇక్కడ చదివిన ఎంతో మంది గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. సెలవుల నేపథ్యంలో ప్రతి రోజు ఉదయం లేదా సాయంత్రం పిల్లలను ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న విజ్ఞాన భాండాగారాలకు తీసుకెళ్లాలి. పుస్తకాలు, నిఘంటువులు, పత్రికలు అక్కడ అందుబాటులో ఉంటాయనే విషయాన్ని తెలియజెప్పాలి. తద్వారా వారిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుంది.

ఒక్క ఊరోళ్లముయ్యాలో.. ఒకటేమేమంత ఉయ్యాలో..



బీబీనగర్ మండలం మహాదేవపురంలో ఒకే రకమైన చీరలతో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఒకే రకమైన చీరలు కట్టుకొని బతుకమ్మ ఆడుతున్న మహిళలు గ్రామాల్లో సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. బతుకమ్మ ఆటలో పేద, ధనిక అని భేదాభిప్రాయం లేకుండా ఉండేందుకు నూతన విధానం అమలు చేస్తున్నారు బీబీనగర్ మండల మహిళలు. గతంలో పట్టు వస్త్రాలు, నగలు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే వారు అలా పేద, ధనిక భేదం వస్తోందని భావించి మహిళలంతా ఒక్కటే అని చాటి చెప్పేందుకు బీబీనగర్ మండలంలోని మహాదేవపురం, కొండమడుగు, రహీంఖాన్‌గూడ, బీబీనగర్, వెంకిర్యాల గ్రామాల్లో పలువురు మహిళలు ఇలాంటి వేడుకకు వాట్సప్ గ్రూప్‌ల ద్వారా పిలుపునివ్వడంతో మిగతా మహిళలు కూడా అనుసరించారు. గ్రామాల్లో ఒక్క ఊరుల్లోముయ్యాలో.. ఒక్కటేమేమంత ఉయ్యాలో.. అంటూ పూల పండగను వైభవంగా జరుపుకొంటున్నారు. - న్యూస్‌టుడే, బీబీనగర్

ఎంజీయూ బీఈడీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం బీఈడీ ఫలితాలను శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.అల్వాల రవి, అదనపు కంట్రోలర్ డా.లక్ష్మీ ప్రభ విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్‌లో 92.6శాతం, మూడో సెమిస్టర్‌లో 79.30శాతం, రెండో సెమిస్టర్‌లో 84.96శాతం, మొదటి సెమిస్టర్‌లో 77.07శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

నల్గొండ సిగలో మరో కలికితురాయి

జిల్లా కేంద్రంలో ట్రిపుల్ ఐటీ ప్రాంగణం ఏర్పాటుకు సన్నాహాలు

ఈనాడు, నల్గొండ : జిల్లా కేంద్రం నల్గొండ మరో ఉన్నత విద్యా సంస్థకు వేదిక కానుందా..? అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం అవుననే అంటోంది. బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయాన్ని (ఆర్‌జీయూకేటీ)కి అనుబంధంగా మరో రెండు కొత్త ప్రాంగణాలను ప్రారంభించాలని భావిస్తున్న ప్రభుత్వం.. అందులో ఒకటి నల్గొండలో ఏర్పాటు చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాంగణాలను ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో త్వరలోనే మాట్లాడనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విద్యాసంస్థల పరంగా మిగతా జిల్లాలతో పోలిస్తే కొంత వెనకబడ్డ నల్గొండ జిల్లాలో ట్రిపుల్ ఐటీ ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తే ఇక్కడి గ్రామీణ విద్యార్థులకు మేలు జరగనుంది. ప్రాంగణం ఏర్పాటుకు అవసరమైన భూమి ఎక్కడుందనే దానిపై ఆరా తీయాలని నల్గొండ, సూర్యాపేట జిల్లాల అధికారులను ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే మౌఖికంగా సూచించినట్లు సమాచారం. నల్గొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల చుట్టుపక్కల ప్రభుత్వ భూముల లభ్యత, అవసరాలపై అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. మరోవైపు ఎంజీ విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన ప్రాంగణం ఏర్పాటు చేసి భూ సేకరణ అనంతరం పక్కా భవనాల నిర్మాణం చేయాలనే ఆలోచనను కొంత మంది అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే ట్రిపుల్ ఐటీ ప్రాంగణం ఏర్పాటుకు ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయని.. వారం పది రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు రెవెన్యూ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో అభిప్రాయపడ్డారు.

మనస్తాపంతో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

శాలిగౌరారం, తిరుమలగిరి, న్యూస్‌టుడే: చేయని దొంగతనం నింద తనపై మోపి.. పోలీస్ స్టేషన్‌లో పెట్టి కొట్టించారని మనస్తాపం చెందిన టిప్పర్ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం శాలిగౌరారం మండలం ఆకారంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారానికి చెందిన టిప్పర్ డ్రైవర్ నాగరాజు తిరుమలగిరి మండలంలోని ఓ క్రషర్ మిల్లులో కొంత కాలంగా పని చేస్తున్నాడు. మిల్లు యజమాని నాలుగు నెలలుగా తనకు జీతం ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని, జీతం డబ్బులు అడిగితే టిప్పర్ల డీజిల్ దొంగతనం చేశావని తనపై కేసు పెట్టాడని, దీంతో తిరుమలగిరి ఎస్సై కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని బాధితుడు నాగరాజు తన స్నేహితులకు సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా చెప్పాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నాగరాజు ఆకారంలో తన వ్యవసాయ బావి వద్ద తీసిన వీడియో ఆధారంగా అతని స్నేహితులు వెళ్లి చూసే సరికి ఉరి వేసుకొని అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం నల్గొండ ప్రైవేటు ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు బంధువులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధి, మిల్లు యజమాని చెబితేనే ఎస్సై తీవ్రంగా కొట్టాడని నాగరాజు చెప్పారు. స్పందించిన స్థానిక ప్రజాప్రతినిధి సామాజిక మాధ్యమాల్లో మాట్లాడిన వెంకన్నకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తూ బలవన్మరణ యత్నం చేసుకునే విధంగా భయభ్రాంతులకు గురిచేసిన యజమానిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. డీజిల్ చోరీ జరగడంపై ఆరుగురిపై మిల్లు యజమాని ఫిర్యాదు చేశారని, దర్యాప్తు చేయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్సై వి.సురేశ్ తెలిపారు. వారే మాట్లాడుకుంటామని వెళ్లారని, నేను ఎలాంటి చిత్రహింసలకు గురి చేయలేదని తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: పరిమితికి మించిన వేగంతో లారీ దూసుకు రావడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన కల్మెడతండా వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. మరో ఐదు నిమిషాల్లో తన ఇంటికి చేరాల్సిన వ్యక్తి అనంత దూరాలకు వెళ్లిపోయాడు. ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ దర్గా ఆవాస గ్రామం కల్మెడతండా నివాసి, రేషన్ డీలర్ ధరావత్ శివరాం నాయక్(68) ద్విచక్రవాహనంపై వ్యవసాయ పనుల నిమిత్తం దామరచర్లకు వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించాడన్నారు. తెలుగు రాష్ట్రాల్లో నాటకరంగంలో అనేక పాత్రల్లో రాణించి పలు అవార్డులు సాధించిన శివరాంనాయక్ మృతిపై పలువురు కళాకారులు, గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



శివరాం నాయక్

కారు బోల్తా.. భర్త మృతి

భార్యతోపాటు మనుమరాలికి గాయాలు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కారు బోల్తా పడటంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం మండలంలోని అడివెంల స్టేజీ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం పెదనెమిల గ్రామానికి చెందిన, సర్వాయి పాపన్న గౌడ్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రేసు రాములు(49), అతని భార్య అంజమ్మ, మనుమరాలుతో కలిసి తుంగతుర్తిలో తన రెండో కుమార్తె ఇంట్లో శుభకార్యానికి వెళ్లి కారులో తిరుగు పయనమయ్యారు. అడివెంల స్టేజీ సమీపంలో కారు అదుపు తప్పి కల్వర్టు గోడను ఢీ కొట్టడంతో బోల్తాపడి నుజ్జునుజ్జయ్యింది. చుట్టుపక్కల వారు వచ్చి కారులోంచి రాములుతో భార్య, మనుమరాలును బయటికి తీశారు. అప్పటికే రాములు మృతి చెందారు. అతని భార్య, మనుమరాలుకు గాయాలు కావడంతో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు. వివాహం కాని చిన్న కుమార్తె ఇటీవలనే ఉన్నత చదువుల నిమిత్తం లండన్‌కు వెళ్లారు. ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై బాలకృష్ణ తెలిపారు.



రేసు రాములు

చెరువులోకి ఎప్పుడొస్తావ్.. చేపా..!



భానుపురి, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేప పిల్లల విడుదలలో జాప్యం నెలకొంటోంది. అదను దాటుతుండటంతో చేప పిల్లల విడుదల ఉంటుందా లేదా అని మత్స్యకారుల్లో సందిగ్ధం నెలకొంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2,431 చెరువులను మత్స్యశాఖ అధికారులు ఎంపిక చేశారు. నిరంతరం నీళ్లుండే నీటి వనరుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉండగా.. సెప్టెంబరు ముగిసినా ఒక్క చెరువులోనూ విడుదల చేయలేదు.

టెండర్లు ఆలస్యమే

జూన్, జులైలోనే టెండర్లు పూర్తి చేసి ఆగస్టు నాటికి చేప పిల్లలు వదలాల్సి ఉంది. ఉచిత చేప పిల్లల పంపిణీ అమలుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఆలస్యంగా ఉత్తర్వులు రావడంతో జులై 10 నుంచి టెండర్లను ఆహ్వానించగా పెండింగ్ బిల్లులు చెల్లించని కారణంగా గుత్తేదారులు ముందుకురాలేదు. ఆగస్టు 2 వరకు పొడిగించినా స్పందన లేదు. ఆగస్టు 23 వరకు టెండర్ల గడువును పొడిగించడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 మంది గుత్తేదారులు ముందుకొచ్చారు. నల్గొండలో ఐదుగురు, సూర్యాపేట నలుగురు, యాదాద్రి ముగ్గురు మాత్రమే టెండర్లలో పాల్గొన్నారు. వీరికి చెరువులు లేకపోవడం, చేపలు పెంచకపోవడంతో ఉన్నతాధికారులు పరిశీలన చేసి ఆ టెండర్లను రద్దు చేశారు. మళ్లీ కొత్తగా పిలిచారు. నేటికీ గుత్తేదారుల ఎంపిక చేపట్టలేదు.



గతేడాది విడుదల చేసేందుకు తీసుకొచ్చిన చేప పిల్లలు

ఉమ్మడి జిల్లా వివరాలు..

జిల్లా	మత్స్య సంఘాల సభ్యులు	గుర్తించిన చెరువులు	చేప పిల్లల లక్ష్యం (కోట్లల్లో..)
నల్గొండ	27,000	953	6
సూర్యాపేట	15,366	620	3.41
యాదాద్రి	10,000	658	2.71

ఉపాధికి దెబ్బ

చెరువుల్లో ఆలస్యంగా చేప పిల్లలు వదిలితే అవి ఎదిగే అవకాశం ఉండదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నల్గొండ 27,000, సూర్యాపేట 15,366, యాదాద్రి 10,000 సంఘం సభ్యులు ఉన్నారు. వీరంతా చేపల వేటపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఈసారి నేటికీ చెరువుల్లో మీనాలను విడుదల చేయకపోవడంతో వేసవిలో నీళ్లింకే సమయానికి చేపలు ఎదగక నష్టం జరిగే అవకాశం ఉంది.

క్షేత్ర పరిశీలన చేసి ఖరారు చేస్తాం

-నాగులు నాయక్, జిల్లా మత్స్య శాఖ అధికారి, సూర్యాపేట



గుత్తేదారులు చేప పిల్లల పెంపకం చేపడితేనే టెండర్ అప్పగిస్తాం. ఇటీవల పెంపకం చేపట్టకుండా టెండర్‌లో పాల్గొన్న వారిని రద్దు చేశాం. మళ్లీ నలుగురు టెండర్లలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అప్పగించిన వెంటనే చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం.

పెంచుతున్నారు.. కూరగాయల సాగు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో వినియోగదారులు ఇక్కట్లు పడుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లు సాగు విస్తీర్ణం లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. విత్తనాలు అందించే పథకం గత కొన్నేళ్లుగా నిలిచిపోయింది. విత్తనాల పంపిణీ స్థానంలో నారును ఉచితంగా అందించే పథకాన్ని అమలు చేస్తున్నారు.

ముందస్తు దరఖాస్తు తప్పనిసరి

ఉమ్మడి జిల్లాలో మిరప, టమాట, వంగ తోటలు సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ఉచితంగా నారు అందించనున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఎంతైనా నారు ఇవ్వడానికి ఉద్యాన శాఖ ముందుకు వచ్చింది. కావాల్సిన రైతులు నెల రోజుల ముందుగా సంబంధిత ఉద్యాన శాఖ అధికారికి దరఖాస్తు చేయాలి. ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నర్సరీలో టమాట, మిరప, వంగ నారు మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

అవగాహన లేక..

కూరగాయల సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నా.. ఉచితంగా అందించే నారుకు సంబంధించి ప్రచారం లేకపోయింది. దీంతో కూరగాయల సాగుపై ఆసక్తి చూపట్లేదు. నారును నర్సరీ నుంచి తెచ్చుకోవడానికి రవాణా ఖర్చులు కూడా ఉద్యాన శాఖ చెల్లిస్తోంది. కావాల్సిన రైతులు ముందస్తుగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

సాయిబాబ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, నల్గొండ

ఆసక్తి గల అన్నదాతలు ఉచితంగా అందించే మిరప, టమాట, వంగ నారును తీసుకొని సద్వినియోగం చేసుకోవాలి. నారు కావాల్సిన రైతులు 20 నుంచి నెల రోజుల ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలి. నాణ్యమైన నారు అందిస్తాం.



మిరప నారు

కోదాడ

• కోదాడ • హుజూర్‌నగర్

కొనసాగుతున్న డిజిటల్ సర్వే


వసంతపురంలో సర్వే చేస్తున్న ఎంపీడీవో సుష్మ

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ సర్వే కొనసాగుతున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ కమలాకర్ తెలిపారు. రావిపహాడ్‌లో డిజిటల్ సర్వే పనులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. గ్రామంలోని 173 కుటుంబ సభ్యుల వివరాలను సేకరించామని, వాటిని డిజిటలైజేషన్ చేస్తున్నట్లు, మరో 50 కుటుంబాల వివరాలను రానున్న మూడు రోజుల్లో సేకరిస్తామన్నారు.

అనంతగిరి: వసంతపురం గ్రామం ఫ్యామిలీ డిజిటల్ సర్వేకు ఎంపికైన సంగతి తెలిసిందే. సర్వేలో భాగంగా రెండో రోజు అధికారులు సర్వే నిర్వహించారు. శుక్రవారం 200 ఇళ్లల్లో సర్వే పూర్తయిందని ఎంపీడీవో సుష్మ తెలిపారు.

కోదాడ: పట్టణంలోని 30వ వార్డులో రెండో రోజు డిజిటల్ ఫ్యామిలీ సర్వే నిర్వహించామని పుర కమిషనర్ రమాదేవి తెలిపారు. 104 ఇళ్లల్లో సర్వే పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. గడువులోపు సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

గడువు పొడిగింపు

నడిగూడెం, నేరేడుచర్ల, కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు గడువు తేదీని ఈనెల 31 వరకు పొడిగించినట్లు నడిగూడెం అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఎం.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని అనంతగిరి రోడ్డు నుంచి కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వరకు మధ్యలో వీధి దీపాలు వెలగడం లేదు. –రమేష్, కోదాడ

✔ పరిశీలించి వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. –నాగరాజు, పుర ఎలక్ట్రీషియన్, కోదాడ.

సర్వజన సభ వాయిదా

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెం ప్యాక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సర్వజన సభకు సభ్యుల కోరం పూర్తి కాకపోవడంతో సభను వాయిదా వేసినట్లు ప్యాక్స్ ఛైర్మన్ కొల్లు రామారావు తెలిపారు. మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

పరిహారం అందేనా..!

నియోజకవర్గంలో గత నెలలో వచ్చిన భారీ వరదలకు చాలా మంది నిరాశ్రయులయ్యారు. ఇళ్లలోకి నీరు వచ్చి నిత్యావసర వస్తువులు పాడవడంతో ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఇంటింటికీ రెవెన్యూ అధికారులు తిరిగి జాబితా తయారు చేసి నష్టపరిహారం అందజేశారు. అధికారులు తప్పుడు నివేదికలు పంపారని, ఇళ్లు మునిగినా తమకు నష్టపరిహారం అందలేదని బాధితులు కొద్ది రోజులుగా ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నాలు చేస్తున్నారు.

–కోదాడ, న్యూస్‌టుడే:





ఈ చిత్రంలో వరదలో కనిపిస్తున్న ఇల్లు ఉన్న ప్రాంతం పట్టణంలోని సాయినగర్‌లోనిది. వరద నుంచి తప్పించుకునేందుకు సాయం కోసం ఎదురు చూస్తున్న ఇంటి యజమాని పేరు ఎస్‌కే మౌలానా. ఇంట్లో బియ్యంతో పాటు, ఫ్రిడ్జ్, కూలర్, ఇతర విలువైన వస్తువులు తడిసిపోయాయని బాధితుడు వాపోతున్నారు. వీరికి నష్ట పరిహారం రాలేదు. ఇదే కాలనీలో చాలా మందికి నష్టపరిహారం అందలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధితుల ఎంపికపై విమర్శలు..!

అధికారులు క్షేత్రస్థాయిలో తిరగకుండానే బాధితుల పేర్లు రాసుకున్నారని, అధికార పార్టీకి చెందిన నాయకులు ఎవరి పేరు చెబితే వారినే గుర్తించారని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. పట్టణంలో 2 వేల మంది వరకు బాధితులు ఉండగా కేవలం 1,400 మందికే నష్టపరిహారం అందింది. ఒక్కొక్కరికి రూ.16,500 నష్టపరిహారం నేరుగా బ్యాంకు అకౌంట్లో వేశారు. దానిలో భాగంగానే పట్టణానికి చెందిన బాధితులు, అనంతగిరి, కోదాడ రూరల్ గ్రామాలకు చెందిన వారు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నాలు కూడా చేశారు. నిజమైన బాధితులను అధికారులు గుర్తించి ఇప్పటికైనా నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం

ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీనివాస్, కోదాడ

నష్టపరిహారం అందని వరద బాధితులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోండి. క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి, ఆ నివేదికను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాం. నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాం.

పరిహారం అందిన బాధితుల వివరాలు..

మండలం	బాధితుల సంఖ్య
కోదాడ పట్టణం	1,421
కోదాడ రూరల్	666
అనంతగిరి	570
చిలుకూరు	128
మునగాల	62
నడిగూడెం	26

వస్తువులన్నీ తడిసిపోయాయి: వెంకట్‌రావు, భవానినగర్, కోదాడ

మా ఇంట్లోకి నీరు రావడంతో మా బంధువుల ఇంటికి వెళ్లాం. వరద తగ్గాక వచ్చి చూస్తే ఇంట్లో ఉండే వస్తువులన్నీ తడిసిపోయాయి. బీరువాలోకి నీరు వెళ్లి విలువైన పత్రాలు తడిశాయి. సుమారు రూ.50 వేల వరకు నష్టపోయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. అధికారులు మా ఇంటికే రాలేదు.

దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలి


లేఅవుట్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి శిరీష, తదితరులు

మునగాల, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీల్లో అనుమతి లేని లేఔట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారిణి శిరీష అన్నారు. మునగాల, ఆకుపాముల గ్రామాల్లోని లేఔట్లను తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 1,158 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అధికారులు పరిశీలనకు వచ్చినప్పుడు దరఖాస్తుదారులు తమ ఆధారాలను చూపించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ వినయ్, నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల పురపాలిక-2020లో ప్లాట్ క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసిన వారు రెగ్యులరైజ్ చేయించుకోవాలని పురపాలిక కమిషనర్ అశోక్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

గరిడేపల్లి, న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వం రైతులపై తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరిలో శాంతియుతంగా నిర్వహిస్తున్న ప్రదర్శనపై దాడి జరిగి మూడేళ్లయినా నేటికీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం వెలిదండలో కొవ్వొత్తులతో మృతులకు నివాళి అర్పించారు. నవీన్, అంజయ్య, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, సంతోష, రేణుక, లక్ష్మినరసమ్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: భక్తులు, దాతలు, అధికారుల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు అన్నారు. బూరుగడ్డ గ్రామంలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామి ఆలయానికి నూతనంగా నియామకమైన ధర్మకర్తలు యరగాని గురవయ్య, గంధం అంజయ్య, తిపిరిశెట్టి హరీష్, మెరిగ కవిత, వేముల నరసింహారావు, కోలా కృష్ణప్రసాద్, హనుమంతరావు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా హరీష్‌కుమారాచార్యులతో ప్రత్యేక అధికారి ఈవో గుజ్జుల కొండారెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో దేవాలయ ఛైర్మన్‌గా యరగాని గురవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఈవో ఎంపీ లక్ష్మణ్‌రావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారావు, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, తితిదే మాజీ సభ్యులు సాముల రాంరెడ్డి, బాలకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.


బూరుగడ్డలో ప్రమాణ స్వీకారం చేసిన ధర్మకర్తలు

ఆకట్టుకున్న వేడుకలు


నడిగూడెం: కేవీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల, నడిగూడెం: నడిగూడెం కేవీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డి.విజయ నాయక్ వేడుకలను ప్రారంభించారు. నేరేడుచర్లలోని పలు కళాశాలల్లో నిర్వహించారు.


నేరేడుచర్లలో..

రెండో రోజు అవగాహన కార్యక్రమం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: కేవీకే ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గడ్డిపల్లిలో రెండో రోజు ప్రకృతి వ్యవసాయ సూత్రాలపై శాస్త్రవేత్త కిరణ్ రైతులకు అవగాహన కల్పించారు. నేలను ఎల్లప్పుడూ పంటలతో కప్పి ఉంచడం, పంట వైవిధ్యం, వ్యవసాయంలో పశువులను అనుసంధానం చేయడంపై రైతులకు వివరించారు. జనుము, జీలుగ పచ్చిరొట్టె, ఎరువులు, జీవన ఎరువులతో విత్తన శుద్ధితదితర పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో పెరటి తోటల గురించి తెలిపారు.


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

మట్టపల్లిలో శ్రీలక్ష్మీనృసింహుని మండల దీక్షలు

మఠంపల్లి, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీనృసింహుని మండల దీక్షలు మట్టపల్లి ఆలయంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. 40 రోజుల పాటు పసుపు దుస్తులు, తులసీ మాలలు ధరించి నియమ నిష్ఠలతో దీక్షను కొనసాగించే భక్తులు నవంబరు 15 కార్తిక పౌర్ణమి రోజు ఇరుముడులతో క్షేత్రానికి చేరుకొని, దీక్షను విరమిస్తారు. సుమారు 450మంది శ్రీస్వామి మాలలు వేసుకునే అవకాశం ఉందని గురుస్వామి అద్దేపల్లి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉభయ రాష్ట్రాల్లోని సూర్యాపేట, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి ఈ సంవత్సరం ఎక్కువ మంది దీక్షలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.


దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు


నేరేడుచర్ల: విజయదుర్గ ఆలయంలో కుంకుమార్చనలకు హాజరైన మహిళలు


కోదాడలోని దుర్గామాతకు ప్రత్యేక పూజలు

అలంకరణలు.. పూజలు


హుజూర్‌నగర్: రామకృష్ణ సేవా సమితి భవనంలో...

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల పట్టణంలో విజయదుర్గ ఆలయం, శివాలయం, నర్సయ్యగూడెం, శివాజీనగర్‌లలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఉత్సవ కమిటీలు కనుల పండువగా నిర్వహిస్తున్నాయి.

మునగాల: మండల కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి దేవాయంలో అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రశాంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారికి అభిషేకం, చండీహోమం, లలిత సహస్రనామ, లక్ష కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.


మునగాల: గాయత్రి దేవి అవతారంలో అమ్మవారు

వరదలు తెంచిన బంధం.. పల్లెలు కలిపిన వైనం


వరదలకు తెగిపోయిన అల్లీపురం-పాత దొనబండతండా లింకు రహదారి (పాత చిత్రం)

మఠంపల్లి, న్యూస్‌టుడే: అల్లీపురం నుంచి అంజలీపురం, పాత దొనబండతండా, జామ్లతండా గ్రామాలను కలుపుతూ గతంలో నిర్మించిన లింకు రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద వచ్చి 20 అడుగుల మేర తెగిపోయింది. నెల రోజులుగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లారు. నిత్యం మండల కేంద్రానికి, పొలాలకు వెళ్లే వారు చుట్టూ తిరిగి 3 కి.మీ. అదనంగా వెళ్లాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను తొలగించుకునేందుకు స్థానిక రైతులు రెండు రోజులు శ్రమించి తెగిన రహదారిని పూడ్చుకున్నారు. 30 ట్రక్కుల మట్టిని పోసి రహదారిని వారే బాగు చేసుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెం మండలం సిరిపురంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై బి.అజయ్‌కుమార్ తెలిపారు. బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారి రామిరెడ్డికి శుక్రవారం అప్పగించామని, ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు

మట్టపల్లిలో పురుషోత్తంరెడ్డి అస్థికలు నిమజ్జనం

మఠంపల్లి, న్యూస్‌టుడే: దివంగత నలమాద పురుషోత్తంరెడ్డి అస్థికలను ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మట్టపల్లి క్షేత్రంలోని కృష్ణానదిలో శుక్రవారం సోదరుడు గౌతంరెడ్డితో కలిసి నిమజ్జనం చేశారు. స్థానిక శివాలయం వద్ద ఉన్న మార్కండేయ ఘాట్ వద్ద వేద పండితులు ఈ కార్యక్రమానికి ముందు శ్రాద్ధ క్రతువును మంత్రితో శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఉత్తమ్ కుటుంబ సభ్యులతో పడవపై నది మధ్యకు చేరుకుని అస్థికలను పవిత్రజలాల్లో కలిపారు. అధికారులతో పాటు పలువురు ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు సాముల శివారెడ్డి, మంజీనాయక్, అప్పారావు, అరుణ్‌కుమార్, బాలకృష్ణ, రామిరెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి.. నిరసన తెలిపి


హుజూర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని వెంటనే రూపొందించి అమలు పరచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేదంటే దేశ వ్యాప్తంగా ఉన్న న్యాయవాదుల డిమాండ్ల సాధన కోసం ఉద్యమించనున్నట్లు తెలిపారు. భౌతికదాడులపై కేసులు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తమ విధుల బహిష్కరణకు సహకరించాలని కోరుతూ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్‌లకు వినతి పత్రాలు అందజేశారు. న్యాయవాదులు శ్రీనివాసరావు, యాదగిరి, గోపాలకృష్ణమూర్తి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం: సీపీఎం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకిస్తున్నా కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. రాజీవ్‌నగర్‌లో శుక్రవారం సీపీఎం మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ భూములలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు వెంటనే పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని, వెంటనే మంజూరు చేయాలన్నారు. సీపీఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు బసవయ్య, ముత్యాలు, శ్రీనివాస్, తదితరులున్నారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: ప్రజా పోరాటాలను నిర్వహించేది కమూనిస్టులే అని, రాబోయే భవిష్యత్ కమ్యూనిస్టులదేనని సీపీఎం మండల కార్యదర్శి హుస్సేన్ అన్నారు. అంజలీపురంలో కొప్పుల నాగమ్మ ఆధ్వర్యంలో పలు కుటుంబాలు సీపీఎం పార్టీలో చేరిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్షాలకు నష్టపోయిన రైతులకు రూ.50 వేల పరిహారం అందించాలని, ఇసుక, రాళ్లు మేటలు వేసిన పొలాలను ప్రభుత్వం బాగు చేయాలని డిమాండ్ చేశారు.

అవీ ఇవీ

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు.. కోదాడ పట్టణం: ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రాము అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత కొత్తచట్టాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సై మల్లేష్, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ జిలానీలను యూనియన్ సభ్యులు సన్మానించారు. సంత అడ్డా యూనియన్ అధ్యక్షుడు శ్రీను, కోశాధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి గౌరవాన్ని కాపాడాలి.. కోదాడ పట్టణం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల స్థితిగతులు, భవిష్యత్తు దిశ మార్గ నిర్దేశనంపై చర్చించి ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సామాజిక ఆర్థిక విశ్లేషకుడు బడుగుల సైదులు కోరారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు.

మూడేళ్లుగా వేతనాలు చెల్లించడం లేదు... నడిగూడెం: కరివిరాల గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నా మూడేళ్లుగా వేతనాలు చెల్లించడం లేదని జిల్లా అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు బి.వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక, మండల అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని, కలెక్టర్, డీపీవోకు ఫిర్యాదు చేశానని, ఇప్పటికైనా చర్యలు తీసుకొని వేతనం చెల్లించాలని కోరారు.

డిమాండ్.. హుజూర్‌నగర్ గ్రామీణం: మంత్రి కొండా సురేఖకు మాజీ మంత్రి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని కోరారు.

సంతాపం.. హుజూర్‌నగర్: పాలకవీడు మండలానికి చెందిన కళాకారుడు శివరాం నాయక్ రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందారు. శివరాం నాయక్ మృతిపట్ల స్థానిక కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు. కళాకారులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ప్రకాశ్‌బాబు, భద్రయ్యాచారి, షేక్ మౌలానా, ఖాసీం, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం.. నడిగూడెం: నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డి.విజయనాయక్ జిల్లా ప్రిన్సిపల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఇదే కళాశాలలో పనిచేస్తున్న కె.శ్రీధర్ ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావడంతో శుక్రవారం కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సత్కరించారు.

రక్తదానం.. హుజూర్‌నగర్: రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న అభాగ్యులను కాపాడాలని జనచైతన్య ట్రస్టు సభ్యుడు సాయి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శైలజ అనే మహిళకు రక్తం అవసరం కాగా జనచైతన్య ట్రస్ట్ సభ్యులు దాత ద్వారా బాధితురాలికి రక్తం అందించారు. రక్తదాత అజయ్‌ని అభినందించారు.

జూదరుల అరెస్టు.. కోదాడ: జూదం ఆడుతూ నిందితులు పట్టుబడిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుడిబండ రోడ్డులోని ఓ భవనంలో ఎనిమిది మంది జూదం ఆడుతుండగా పట్టణ ఎస్సై రంజిత్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు పరారు కాగా ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి రూ.10,200 నగదును స్వాధీనం చేసుకొని, పరారీలో ఉన్న వారు సహా ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అందజేత.. పాలకవీడు గ్రామీణం: అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమతలేని బాధితులకు సీఎం సహాయనిధి వరం లాంటిదని మాజీ ఎంపీపీ గోపాల్ తెలిపారు. రాఘవపురం గ్రామానికి చెందిన శ్రీరాముల జానకిరాములు ఇటీవల అనారోగ్యానికి గురికావటంతో వైద్య ఖర్చుల కోసం మంజూరైన రూ.60వేల చెక్కును ఉమ్మడి నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలసి బాధితునికి చెక్కును అందించారు.

నాటు సారా స్వాధీనం.. చింతలపాలెం: ఎర్రకుంట తండాలో స్థానిక, ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి భూక్యా వీరన్న ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అంతిరెడ్డి తెలిపారు. సారాలో ఉపయోగించే 150 లీటర్ల బెల్లం ఊటను పారబోసినట్లు చెప్పారు.

పలువురు న్యాయమూర్తుల బదిలీ

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది కోదాడ సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగోన్నతి పొంది సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఇన్నాళ్లు ఇక్కడ పని చేసిన పి.శ్రీవాణి సూర్యాపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. కోదాడ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యాంసుందర్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగోన్నతి పొంది భువనగిరి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. బదిలీ అయిన న్యాయమూర్తులు ఈ నెల 18 నుంచి 24వ తేదీల మధ్య బాధ్యతలు తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల్లో పేర్కొంది.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాంప్లెక్స్:** దేవర, **రంగా:** శ్వాగ్, **వెంకటేశ్వర:** మత్తువదలరా-2

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని టీఆర్‌వీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చామకూరి మహేందర్ అన్నారు. సూర్యాపేట రాడికల్ చెస్ అకాడమీకి చెందిన బాలిక చంద్రోలు దివ్య భవాని హంగేరీలో అన్‌రేటెడ్ ప్రిన్సెస్ ఆఫ్ ద వరల్డ్ టైటిల్ గెలిచి అవార్డు అందుకున్నారు. శుక్రవారం ఆమెను స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో టీఆర్‌వీఎస్పీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ అనిల్ కుమార్, గిరిజన శక్తి రాష్ట్ర నాయకులు వెంకటేశ్ నాయక్, పెద్ది మహేశ్, అనంతల యశ్వంత్, రాకేశ్, వినయ్ పాల్గొన్నారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని కొత్తబస్టాండ్ వద్ద రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
– నాగేశ్, సూర్యాపేట

✔ తారుతో గుంతలు పూడ్చి వేయిస్తాం. – యుగేందర్, ఆర్అండ్‌బీ, ఏఈ, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని సీతారాంపురంలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి పూట కునుకు తీయలేని పరిస్థితి. నివారణ చర్యలు చేపట్టాలి.
– రాజేష్, సీతారాంపురం

✔ దోమల మందు పిచికారి చేయిస్తాం.
– సురేష్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్, సూర్యాపేట

డ్రమ్‌సీడర్ వినియోగం లాభదాయకం


వరిలో డ్రమ్‌సీడర్ వినియోగంపై బెంచ్‌మార్క్ సర్వే చేస్తున్న గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: వరిలో డ్రమ్‌సీడర్ వినియోగం, వెదజల్లే పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు డి.నరేష్, ఎ.కిరణ్ తెలిపారు. మండలంలోని దూపహాడ్, లింగాల గ్రామాల్లో భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్, ఎస్‌బీఐ సంస్థ సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో నేరుగా వరి విత్తే పద్ధతిపై రైతుకు శుక్రవారం బెంచ్‌మార్క్ సర్వే నిర్వహించారు. డ్రమ్‌సీడర్‌తో సాగు చేసే నేలలు, విత్తన రకాలు, ఎరువుల వినియోగం, చీడ, పీడల సమస్య, నీరు, కలుపు యాజమాన్య పద్ధతుల గురించి రైతులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేవీకే క్షేత్రసహాయకులు సంతోష్, శ్రీకాంత్, అజయ్, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే దీర్ఘకాలిక ప్రయోజనాలు

నాగారం, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ పండించే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి తీగల నాగయ్య అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. రైతులు ప్రాథమిక దశలో జాగ్రత్తలు పాటిస్తే దీర్ఘకాలంపాటు అధిక లాభాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారిణి ప్రమిత, రైతులు కడారి నర్సింహారెడ్డి, నరేశ్, జగదీశ్, సైదులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల గుర్తింపు

నూతనకల్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏడాదికి వంద రోజుల పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో నూతనకల్‌లో శుక్రవారం పనుల గుర్తింపు చేపట్టారు. ఏపీవో శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి శర్మ, ఈసీ లక్ష్మయ్య, సాంకేతిక అధికారిణి స్వరూప, క్షేత్రసహాయకుడు గుండాల లింగయ్య గ్రామంలో కంపచెట్లు పెరిగి, పూడికతో నిండిన ఎస్సారెస్పీ, వరదకాలువలు కూలీలకు పని కల్పించడానికి అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. వాటి సామర్థ్యాన్ని కొలతతో నమోదు చేశారు. ఎంపీడీవో సునీత పనుల గుర్తింపును తనిఖీ చేశారు.

ఊరిలోనే యువతకు జీవనోపాడి


నూర్జహాన్‌పేటలో గేదెలకు మేత వేస్తున్న కిన్నెర వెంకన్న

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: విద్యావంతులైన యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా సొంత ఊర్లోనే పాడి పరిశ్రమను స్థాపించుకొని జీవనోపాధి పొందుతున్నారు. తమ వ్యవసాయ భూమిలో షెడ్డు నిర్మించుకొని గేదెలు పెంచుతున్నారు. ఎప్పటికప్పుడు పశువైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా మెరుగైన పాల దిగుబడి సాధిస్తూ లాభాల బాటలో నడుస్తున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని వివిధ గ్రామాల్లోని వ్యవసాయ కుటుంబాలకు చెందిన యువకులు పాడి ద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రైవేటు లెక్చరర్ ఉద్యోగం వదులుకొని..



– జంజిరాల నరేష్, పెన్‌పహాడ్

రెండేళ్ల క్రితం రూ.13 లక్షల వ్యయంతో పాడి పరిశ్రమ స్థాపించాను. ప్రైవేటు లెక్చరర్ ఉద్యోగం వదులుకొని సొంత ఊరిలో తల్లిదండ్రుల వద్ద ఉంటూ 12 గేదెలు పోషిస్తున్నాం. వీటిలో ఏడింటి ద్వారా రోజూ 45 లీటర్లు పాల దిగుబడి వస్తోంది. నెలకు రూ.35 వేలు ఖర్చు అవుతున్నాయి. రూ.55 వేల చొప్పున ఆదాయం వస్తోంది. నిపుణుల సలహాలు పాటించడం ద్వారా పాలదిగుబడి పెరిగింది.

ఆర్థిక సమస్యలు అధిగమిస్తున్నాం - కమ్మంపాటి సుధాకర్, సింగారెడ్డిపాలెం



షెడ్డు నిర్మించుకొని 10 గేదెలు, 15 ఆవులను నాలుగేళ్లుగా పెంచుతున్నాను. దాణా, కూలీల కోసం రూ.50 వేలు పెట్టుబడి పెడుతున్నాం. రోజూ 70 లీటర్లు పాల దిగుబడి రావడంతో నెలకు రూ 65 వేలు ఆదాయం లభిస్తోంది. ఉత్పత్తియిన పాలను సూర్యాపేట పట్టణంలోని ఇళ్లల్లో, మదర్ డెయిరీలో విక్రయిస్తున్నాం. నెయ్యి అమ్మడం ద్వారా అదనపు ఆదాయం లభిస్తోంది. పాడి పరిశ్రమతో ఆర్థిక సమస్యలను అధిగమిస్తున్నాం. ఇంటి వద్ద స్వయం ఉపాధి పొందుతున్నాం.

నెలకు రూ.65 వేల ఆదాయం

– కిన్నెర వెంకన్న, నూర్జహాన్‌పేట

ప్రభుత్వ సాయంతో మూడేళ్ల క్రితం సొంత వ్యవసాయ భూమిలో పాడి పరిశ్రమ ఏర్పాటు చేశాను. ఆరు గేదెలు, ఒక ఆవును పెంచడం ద్వారా రోజూ 30 నుంచి 35 లీటర్ల పాల దిగుబడి వస్తోంది. వాటి విక్రయంతో నెలకు రూ 65 వేలు ఆదాయం పొందుతున్నాం. పోషణకు రూ.15 వేలు ఖర్చు చేస్తున్నాం. దాణా కోసం 30 గుంటల భూమిలో గడ్డి పెంచుతున్నాను. పశు వైద్యాధికారుల సూచనలతో గేదెల ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపడుతున్నాం.

పాడి పరిశ్రమతో ఆర్థికాభ్యున్నతి

– ఎగ్గడి శ్రీకాంత్, పొట్లపహాడ్



కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో మూడేళ్ల క్రితం నాలుగు గేదెలతో పాడి పరిశ్రమ స్థాపించాను. ప్రస్తుతం గేదెలు, మూడు ఆవుల ద్వారా రోజూ 120 లీటర్ల పాల దిగుబడి వస్తోంది. కూలీలు, దాణా తదితర పెట్టుబడి కోసం రూ. 1.80 లక్షలు ఖర్చు చేస్తున్నాం. నెలకు రూ. 80 వేల ఆదాయం సంపాదిస్తున్నాను. పాడి పరిశ్రమ నాలాంటి యువత ఆర్థికాభ్యున్నతికి దోహదపడుతోంది.

రహదారి నిర్మించాలని వినతి

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని మానసనగర్‌లో సీసీ రహదారులు నిర్మించాలని కాలనీ మహిళలు శుక్రవారం పుర కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో మట్టి రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయని మహిళలు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షానికి చిత్తడిగా మారిట రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. జ్యోత్స్న, సునీత, లింగమ్మ, నిర్మల, తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3133	1656
జైశ్రీరాం	3169	2169
ఐఆర్-64	2036	1856
హెచ్ఎంటీ	2729	1656
బాస్మతి	1556	1556
కందులు	9260	4088
పెసర	6773	2566
వేరుసెనగ	7209	3896
మినుములు	3668	3668

అదనపు ఎస్పీ దర్యాప్తు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు సందర్శించారు. పోలీసుల చిత్రహింసల కారణంగా ఆత్మాహత్యాయత్నం చేసుకుంటున్నట్లు శాలిగౌరాం మండలానికి చెందిన శెనిగల నాగరాజు సెల్ఫీ వీడియో తీసుకొని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంపై దర్యాప్తు చేసినట్లు తెలిసింది. ఈ కేసు వివరాలను ఎస్సై వి.సురేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అదనపు ఎస్పీ వెంట తుంగతుర్తి సీఐ శ్రీను నాయక్ ఉన్నారు

ప్రజాస్వామిక ఉద్యమాల్లో న్యాయవాదులు కీలకం: తెజస


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మార్జున్

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్ల భారాస పాలనలో ప్రజాస్వామిక విలువలు కనుమరుగయ్యాయని, కేసీఆర్ అణచివేత పాలన సాగించారని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ అన్నారు. పట్టణంలోని తెజస కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ లీగల్ జిల్లా నిర్మాణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తులు అని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం నుంచి తెలంగాణ విముక్తి వరకు జరిగిన ప్రతి పోరు, ప్రజాస్వామిక ఉద్యమాల్లో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెజస లీగల్ సెల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కుంచం చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శిగా షేక్ నాగుల్ పాషా, ఉపాధ్యక్షులుగా ధరావత్ వీరేశ్ నాయక్, బొజ్జ అనిల్, భాషబోయిన వేణు రాజు, సహాయ కార్యదర్శులుగా మంగునాయక్, సుధాకర్ గౌడ్, సతీష్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా నవీన్, శ్రీనివాస్ గోపిలను ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ డిజిటల్ కార్డు సర్వే


తిరుమలగిరిలో డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో అప్పారావు

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన నాగులపహాడ్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ఇంటింటి సర్వే శుక్రవారం కొనసాగింది. గ్రామంలో 182 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉండగా 179 కుటుంబాల వివరాలు సేకరించామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు లాలు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీవో సంజీవయ్య, ఆర్ఐలు రంజిత్ రెడ్డి, అజిజున్నిసా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: మండలంలోని రామచంద్రాపురంలో 190 కుటుంబాలను సర్వే పూర్తి చేసినట్లు తహసీల్దార్ అమీన్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం సర్వే పూర్తవుతుందని తహసీల్దారు తెలిపారు.

తిరుమలగిరి: డిజిటల్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో అప్పారావు అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో జరుగుతున్న డిజిటల్ సర్వేను ఆయన పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలు తప్పులు దొర్లకుండా సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ హరిప్రసాద్, ఇన్‌ఛార్జి పుర కమిషనర్ ఎం.బుచ్చిబాబు, ఆర్ఐ బాబా పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

మద్దిరాల, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎం.వీరన్న శుక్రవారం అన్నారు. మద్దిరాల మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన దూడపాటి నాగయ్య ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజా అవసరాల నిమిత్తం అధికారుల వద్ద అనుమతులు తీసుకొని ఇసుక తీసుకెళ్లాలని ట్రాక్టర్ యజమానులకు సూచించారు.

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరిలోని అదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వేడుకల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.మంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త జి.కవిత, రాములమ్మ, పాల్గొన్నారు.


తిరుమలగిరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.మంగమ్మ

గుడుంబా స్థావరాలపై విస్తృత దాడులు

మద్దిరాల, న్యూస్‌టుడే: నిషేధిత బెల్లం, పటిక రవాణా, నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీను, జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారి రామకృష్ణ హెచ్చరించారు. వారిద్దరి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మామిండ్ల ఆవాసం దరావత్ తండా, ఆంగోత్ తండా, చౌళ్లతండా, ఆవాసతండా రాజానాయక్‌తండాల్లో పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 లీటర్ల బెల్లం పానకం, 30కిలోల బెల్లం, రెండు కిలోల పటిక, పది లీటర్ల సారాయి పట్టుకున్నారు. ఆయా తండాలకు చెందిన దరావత్ దస్రు, దరావత్ భద్రమ్మ, హిమలపై కేసు నమోదు చేసినట్లు సీఐ, జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వీరన్న, సూర్యాపేట టౌన్ ఎక్సైజ్ అధికారి సురేంద్రబెనర్జీ, ఎక్సైజ్ ఎస్సై మూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


దరావత్‌తండాలో బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి


సాయి కుమార్

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఇటీవల ట్రాక్టర్‌పై నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైన మండలంలోని మర్రిబాయితండాకు చెందిన భూక్యా శారద కుమారుడు సాయి కుమార్(24) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఇటీవల తండావాసులు జాన్ పహాడ్ దర్గాకు వెళ్లి తిరిగి వస్తుండగా సూర్యాపేట సమీపంలో ట్రాక్టర్‌పై నుంచి సాయికుమార్ కింద పడినట్లు తండా ప్రజలు తెలిపారు. బాధితులది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులు తలా కొంత చందా పోగేసి సుమారు రూ.20 వేలు సేకరించి వైద్యం, అంత్యక్రియలకు వినియోగించారు. శారదకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. కొన్నేళ్ల క్రితం భర్త, ఇప్పుడు కుమారుడు మృతిచెందడంతో శారద కన్నీరుమున్నీరయ్యారు.

చెరువు కట్టపై నుంచి జారిపడి వ్యక్తి..

మోత్కూరు, న్యూస్‌టుడే: జారి కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మోత్కూరు మండలం అనాజిపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మోత్కూరు పురపాలిక పరిధి కొండాపురం గ్రామానికి చెందిన మన్నె వెంకటయ్య(55) ద్విచక్ర వాహనంపై పొడిచేడు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా అనాజిపురం చెరువు కట్టపైన మలుపు వద్ద జారి కింద పడ్డారు. తీవ్ర గాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై నాగరాజు తెలిపారు.

గత పాలకుల తప్పులు బయటికితీస్తాం: ఎమ్మెల్యే సామేల్


తుంగతుర్తిలో పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: తాను నిజమైన ఉద్యమకారుడిగా ప్రజల సమస్యలు, బాధలు తెలిసిన వ్యక్తినని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం వెలుగుపల్లి వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత పాలకులు చేసిన అరాచకాలు భరించలేకే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, వారి తప్పులను బయటికి తీసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో చేసే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ప్రజలను కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు దొంగరి గోవర్ధన్, సైదులు, సుంకరి జనార్దన్, రాంబాబు, వెంకన్న పాల్గొన్నారు.

తుంగతుర్తి: అనాదిగా వస్తున్న తెలంగాణ బతుకమ్మ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ భవిష్యత్తు తరాలకు అందించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో దాయం ఝాన్సీరెడ్డి రూపొందించిన బతుకమ్మ పాటల సీడీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, రాంబాబు, చింతకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

దిగజారుతున్న రాజకీయ విలువలు: సీపీఎం

చివ్వెంల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష నాయకులు హుందాగా వ్యవహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ మండల శాఖ మహాసభకు హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఒకరిపై ఒకరు అసభ్య పదజాలం వాడుతూ రాజకీయ విలువలను దిగజారుస్తున్నారని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, లేనప్పుడు ఒకమాట మాట్లాడుతూ రాజకీయాలను కలుషితం చేస్తున్నారన్నారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా బొప్పని సులేమాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు ఇట్టమళ్ల ఏసోబు, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న, మండల కార్యదర్శి బచ్చలకూరి రాంచరణ్, నాయకులు అమ్మయ్య, నారాయణ, నవీన్, ఏసు, లింగయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేషన్ బియ్యం పట్టివేత.. ఆత్మకూర్(ఎస్): మండలంలోని ఏనుబాముల స్టేజీ వద్ద ఆత్మకూర్(ఎస్) పోలీసులు 4.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. నూతనకల్ మండలం యడవెల్లికి చెందిన మన్నె రమేష్ ఆటోలో సూర్యాపేటకు రేషన్ బియ్యం తరలిస్తుండగా వాహనాల తనిఖీలో ఇవి పట్టుపడ్డాయి. ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఆర్.శంకర్‌నాయక్ తెలిపారు.

నియామకం.. మద్దిరాల గ్రామీణం: తెలంగాణ జనసమితి పార్టీ సూర్యాపేట జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడిగా మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బాషబోయిన వేణురాజ్‌ను నియామకం చేసినట్లు టీజేఎస్ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'సీనియర్ నాయకులకు దక్కని గుర్తింపు'.. జాజిరెడ్డిగూడెం: అర్వపల్లిలోని శ్రీ రామా ఫంక్షన్‌హాల్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి సీనియర్ కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచార్యులు తెలిపారు. అర్వపల్లిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీలో కొన్నేళ్ల నుంచి పని చేస్తున్న కార్యకర్తలు, నాయకులకు సరైనా గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

రాములు మృతి బాధాకరం.. నూతనకల్ గ్రామీణం: సర్వాయి పాపన్న గౌడ్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పెదనెమిల గ్రామానికి చెందిన రేసు రాములు గౌడ్ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని పెద్దనెమిలలో వారు విలేకరులతో మాట్లాడారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి, రామచంద్రయ్య, యాదగిరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ప్రహరీకి రంగులు.. జాజిరెడ్డిగూడెం: జాజిరెడ్డిగూడెంలోని జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రహరీలకు శుక్రవారం పూర్వ విద్యార్థులు, దాతలు కొణతం పాపయ్య, సుతారపు రవీందర్, గంట రవీందర్, గొల్లబోయిన అంబేద్కర్, సయ్యద్ సమ్దాని సుమారు రూ.50 వేలు వెచ్చించి రంగులు వేయించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్‌పర్సన్ కుంభం రమణ, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, నోడల్ అధికారి ప్రభాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింగ శ్రీనివాస్ గౌడ్, బింగి కృష్ణమూర్తి, మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు.. నాగారం: తుంగతుర్తి నియోజకవర్గ భాజపా ఇన్‌ఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య జన్మదిన వేడుకలను శుక్రవారం నాగారంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నోముల యాకూబ్, శివ, కర్నాటి సతీష్, బొబ్బలి కిరణ్, రమేశ్ పాల్గొన్నారు.

యశోదా ఆసుపత్రిలో మాజీ మంత్రి అనుచరుల హంగామా

సోమాజిగూడ, న్యూస్‌టుడే: యశోదా ఆసుపత్రి భద్రతా సిబ్బంది, ఉద్యోగులపై మాజీ మంత్రి అనుచరులు దాడి చేసి, ఆసుపత్రి అద్దాలు ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమాజిగూడలోని ఆసుపత్రిలో గురువారం యూట్యూబర్ చిలుక ప్రవీణ్‌ను పరామర్శించడానికి భారాస నేత, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అనుచరులతో కలిసి వెళ్లారు. ప్రవీణ్ చెప్పే విషయాలను వీడియో చిత్రీకరించడానికి అనుచరులు ప్రయత్నించారు. దీనిపై ఆసుపత్రి భద్రతా సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో వీడియో తీయవద్దని అనుచరులను వారించడంతో మాటామాట పెరిగి దాడులు చేసుకునే వరకు వెళ్లింది. మాజీ మంత్రి అదుపు చేసే ప్రయత్నం చేసినా అనుచరులు ఆవేశంతో దాడులకు పాల్పడ్డారు. అక్కడ ఉన్న సిబ్బంది, రోగులు భయపడిపోయారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం: జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట (తాళ్లగడ్డ): ప్రజా సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతోపాటు భారాస కార్యకర్తలకు బీమా చెక్కులను శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ కోసం పుట్టిన ఏకైక పార్టీ భారాస అని పేర్కొన్నారు. కేసీఆర్ నిర్మాణాత్మక ఆలోచనలతో ముందుకెళ్తే. కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, జీడి బిక్షం, పుట్టా కిశోర్, సుంకరి రమేశ్ పాల్గొన్నారు.

అభినందనీయం.. సూర్యాపేట(తాళ్లగడ్డ): వరంగల్‌లో గత నెల కియో జపాన్ చోటో ఖాన్ కరాటే ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా వాసులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో పతకాలు, ధ్రువపత్రాలను క్రీడాకారులకు శుక్రవారం అందజేశారు. కరాటే మాస్టర్లు షేక్ సయ్యద్, తహేర్ పాష, రియాజుద్దీన్, తూడి నర్సింహరావు, పుట్ట కిశోర్ పాల్గొన్నారు.


సూర్యాపేట: కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, తదితరులు

గాయత్రిదేవిగా అలంకరణ


నూతనకల్: తాళ్లసింగారంలో

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లాకేంద్రంలో రెండో రోజు అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కన్యకాపరమేశ్వరి, కనకదుర్గ అమ్మ వారి ఆలయంలో భక్తులు కుంకుమ పూజలు జరిపారు.

నూతనకల్: నూతనకల్, యడవెల్లి, తాళ్ల సింగారం, చిల్పకుంట్ల, వెంకేపల్లి గ్రామాల్లో రెండోరోజు దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

తిరుమలగిరి: దేవీశరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పుర ఛైర్‌పర్సన్ పోతరాజు రజని, ఎలసోజు నరేశ్, అంబేద్కర్, మధు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గామాత భక్తులకు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు.

మద్దిరాల: దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శ్యామలదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.


మద్దిరాలలో శ్యామలదేవిగా అమ్మవారు


సూర్యాపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రిదేవిగా అమ్మవారు


సూర్యాపేట: సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

పలువురు న్యాయమూర్తుల బదిలీ

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది కోదాడ సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగోన్నతి పొంది సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఇన్నాళ్లు ఇక్కడ పని చేసిన పి.శ్రీవాణి సూర్యాపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. కోదాడ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యాంసుందర్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగోన్నతి పొంది భువనగిరి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. బదిలీ అయిన న్యాయమూర్తులు ఈ నెల 18 నుంచి 24వ తేదీల మధ్య బాధ్యతలు తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఇసుక విధానంపై నేడు సమావేశం

జాజిరెడ్డిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన మన ఇసుక-వాహనం పథకంపై ట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ల విషయంలో శనివారం తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్టరు యజమానులు పాల్గొనాలని కోరారు.